




# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 99 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi బుధవారం 22 ఏప్రిల్ 2026 ● పేజీలు : 8 ● వెల 2/-


## తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

### 23న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు



**చెన్నై,ఏప్రిల్ 21 ( చట్టం న్యూస్ ):** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మొదటి విడత

మిగతా 2వ పేజీలో..


# వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

- రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది
- పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి
- దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది
- మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు



**అమరావతి,ఏప్రిల్21 ( చట్టం న్యూస్ ):** వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం

మిగతా 2వ పేజీలో..




భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి

మిగతా 2వ పేజీలో..

## తమిళనాడు ఘటన తరహాలో కేరళలో ఘటన

### బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఆరుగురు మృతి..40 మందికి గాయాలు

**తిరువనంతపురం,ఏప్రిల్ 21 ( చట్టం న్యూస్ ):** తమిళనాడు విరుదునగర్‌లోని బాణసంచాలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన మరువక ముందే.. కేరళలో మరో విషాదం నెలకొంది. త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా ఉత్పత్తి కేంద్రంలో మంగళవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందారు. మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. త్రిస్సూర్ తిరువంబడిలోని ఓ బాణసంచా తయారీ యూనిట్లో ఈ సంఘటన జరిగింది. ఈనెల 24న

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

### నార్వే బృందందతో మంత్రి శ్రీధర బాబు



**హైదరాబాద్,ఏప్రిల్ 21 ( చట్టం న్యూస్ ):** తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు

మిగతా 2వ పేజీలో..

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

- పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి
- మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం
- ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం



**చెన్నై,ఏప్రిల్21 ( చట్టం న్యూస్ ):** తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని..
చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి

మిగతా 2వ పేజీలో..

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

### ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి

### ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్



**అమరావతి,ఏప్రిల్ 21( చట్టం న్యూస్ ) :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక

మిగతా 2వ పేజీలో..

## మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

### ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ప్రక్రియ ఏదీ

### ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న వెల్లడి



**హైదరాబాద్,ఏప్రిల్21 ( చట్టం న్యూస్ ):** తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్ధతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులవు తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరపకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 22

మిగతా 2వ పేజీలో..

## తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదదాస్పద వ్యాఖ్యలు

### మోడీని టెర్రరిస్ట్ అంటూ ఎత్తిపొడుపు

### ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు

### అలా అనలేని మళ్లీ వివరణ ఇచ్చిన ఖర్గే



**చెన్నై,ఏప్రిల్ 21 ( చట్టం న్యూస్ ):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదంలో చిక్కుకున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చెన్నైలో మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో ఆయన క్షమాపణలు చెప్పాలంటూ భాజపా డిమాండ్ చేసింది అన్నాడీఎంకే-భాజపా పొత్తును ప్రశ్నించిన ఖర్గే.. ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రిని 'టెర్రరిస్టు'గా అభివర్ణించారు. ఆయనకు

మిగతా 2వ పేజీలో..

## ముస్లిం విద్యార్థులకు కొత్త పథకం

### ఉన్నత విద్య కోసం 'తాలీం ఏ హునర్'

**విజయవాడ,ఏప్రిల్ 21( చట్టం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 14వ వక్ఫ్ బోర్డ్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆయా అజెండాలపై ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు. ఈ మేరకు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ విద్య ఖర్చులను వక్ఫ్ బోర్డ్ భరిస్తుందని తెలిపారు. 'తాలీం ఏ హునర్' పేరుతో వక్ఫ్ బోర్డు ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు నడుపుతోందని.. అదే పేరుతో ఈ విద్యా పథకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం 500 మందికి ఉచిత ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ విద్యను అమలు చేస్తామని వెల్లడించారు. రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్ విద్యతో పాటు జేఈఈ మెయిన్స్, నీట్ కోసం ఉచిత శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. మొదటి ఏడాది 250 మందితో ఈ పథకాన్ని ప్రారంభిస్తామని.. రెండో ఏడాది నుంచి ఏటా 500 మందికి ఉచిత విద్య అందజేస్తామని తెలిపారు. ట్యాలెంట్ టెస్ట్ ద్వారా ముస్లిం విద్యార్థులను ఎంపిక చేస్తామని అన్నారు. వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉన్నత విద్యకు ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. పదోతరగతి ఫలితాల తర్వాత ట్యాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు.

## 23న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్ష

### హాజరు కానున్న33,751 మంది విద్యార్థులు

### నిమిషం ఆలస్యం అయినా పరీక్షకు అనుమతి లేదు

### ఎపీ ఈసెట్ చైర్మన్ ఆచార్య హెచ్. సుదర్శన రావు



**అనంతపురం,ఏప్రిల్ 21( చట్టం న్యూస్ ) :** అనంతపురం జేఎన్టీయూ మరియు ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న

మిగతా 2వ పేజీలో..

## వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

మొదటి పేజి తరువాయి..

వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా,

చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్ధాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

## తమిళనాడు ఘటన తరహాలో కేరళలో ఘటన

మొదటి పేజి తరువాయి..

జరగాల్సిన నమూనా బాణసంచా కోసం ఆ కేంద్రంలో సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ శబ్దం సుమారు కొన్ని కిలోమీటర్ల మేర వినిపించినట్టు స్థానికులు తెలిపారు. తొలుత దీన్ని భూప్రకంపనలుగా భావించినట్టు వారు తెలిపారు. పేలుడు అనంతరం ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అయితే.. నల్లటి పొగలు, మరోసారి పేలుడు సంభవించిన కారణంగా సహాయక చర్యలు కష్టతరంగా మారాయని అక్కడి అధికారులు వెల్లడించారు. ఆ యూనిట్లో పేలని బాణసంచా పదార్థాలు ఇంకా ఉన్నాయనే అనుమానంతో.. అత్యంత జాగ్రత్తగా సహాయక కార్యకలాపాలు సాగుతున్నాయి. పేలుడుకు గల కచ్చితమైన కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు.

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

మొదటి పేజి తరువాయి..

ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లక్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలిసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

మొదటి పేజి తరువాయి..

చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా అగ్రగామి రాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బ్జడెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు. గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడంతో డిమాండ్ పడిపోతుందని, దాని ప్రభావం వ్యాపార రంగంపై కూడా పడుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు.. అవినీతి ఆరోపణలు, సంపద కూడబెట్టాలనే అధిక ఆశలతో ప్రభుత్వం దారి తప్పుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని మాజీ సీఎం జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

## సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

### గోడ పత్రికను ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు



**భూదాన్ పోచంపల్లి ;ఏప్రిల్ 21 (చట్టం ప్రతినిధి) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాల దేశముఖి లో ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్ రావు, కోరారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కే. శ్రీలత, అధ్యాపక బృందంతో కలిసి 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థినులను ఆర్మీ అధికారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్న ఈ కళాశాల సేవలను ప్రశంసించారు. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఆర్మీ శిక్షణ లభించడం విద్యార్థినులకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా. కే. శ్రీలత ప్రవేశాల వివరాలు మరియు కళాశాలలోని సౌకర్యాలను వివరించారు. కళాశాల ప్రత్యేకతలుఅనుభవజ్ఞులైన అధ్యాపకులచే డిగ్రీ బోధనతో పాటు, ఆర్మీ అధికారి పర్యవేక్షణలో విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆర్మీ ట్రైనింగ్ ఇవ్వబడుతుంది. యు పి ఎస్ సి శిక్షణతో పాటు ఎన్ సి సి మరియు ఎన్ ఎస్ ఎస్ విభాగాలలో ప్రాధాన్యత ఉంటుంది.వసతులు పరిశుభ్రమైన వంటశాల, ఉచిత భోజన మరియు వసతి సౌకర్యాలు కల్పించబడతాయి. ఇంటర్నెట్ సదుపాయం, కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ లేబరేటరీలు మరియు అత్యాధునిక లైబ్రరీ అందుబాటులో ఉన్నాయి.ప్రవేశాల సమాచారం ఈ నెల 20వ తేదీ నుండి 30వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు సమర్పించవచ్చు. నేరుగా కళాశాల, దేశ్‌ముఖి, కళాశాలయందుసమర్పించవచ్చుమే 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు సెలక్షన్స్ ఉంటాయి. ఇందులో ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్, రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూనిర్వహించబడతాయి. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి .

# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

మొదటి పేజి తరువాయి..



అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్ల్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకలు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప- అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు.

సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

## తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదదాస్పద వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి..

సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే నని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరిరోజైన మంగళవారంనాడు ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ప్రచార సభలో చేసిన టెర్రరిస్టు వ్యాఖ్యలపై ఖర్గే వివరణ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, సీబీఐ, ఈడీ, ఆదాయం పన్ను శాఖ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఆ సందర్భంలోనే తాను మాట్లాడానని, మోదీని టెర్రరిస్టు అని తాను అనలేదని చెప్పారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు. కాంగ్రెస్, డీఎంకే కూటమి సాగించిన ప్రచారంపై మీడియా అడిగినప్పుడు, చాలాబాగా జరిగిందని, అన్ని చోట్ల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తమ కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఖర్గే సమాధానమిచ్చారు. రాహల్ గాంధీ, స్టాలిన్ ఒకే వేదిక నుంచి ప్రచారం సాగించకపోవడంపై అడిగినప్పుడు, ఆ విధంగా చూడకూడదని, ప్రతి ఒక్కరూ ప్లానింగ్ ప్రకారమే ప్రచారం చేస్తుంటారని చెప్పారు. 'నేను ఒకచోట నుంచి ప్రచారం చేస్తే, రాహుల్ మరో చోట ఉంటారు. ఎవరు ఎక్కడ ప్రచారం చేసినా సమష్టి ఆలోచనతోనే ప్రచారం సాగుతుంది. అంతా కలిసికట్టుగా పోరాటం సాగించాం. మేము గెలుస్తాం' అని ఖర్గే సమాధానమిచ్చారు. మోదీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈ అవమానకర వ్యాఖ్యలపై ఖర్గే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. తాను ఎప్పుడూ మోదీని ఉగ్రవాది అని అనలేదన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ప్రధాని మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మైండ్‌సెట్‌కు ఆయన చేసిన వ్యాఖ్యలు అద్దంపడతాయన్నారు. ఆయన నోరుజారి ఈ వ్యాఖ్యలు చేయలేదని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన ప్రసంగాల్లో ప్రధానిని నిందిస్తుంటారని, ఈరోజు రాహుల్ తరఫున మల్లికార్జున్ ఖర్గే ఆపని చేశారని అన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ ఒసామా బిన్ లాడెన్‌ను ఒసామాజీ అని, జకీర్ నాయక్‌ను శాంతిదూత అని సంబోధిస్తుంటుందని ఎద్దేవా చేశారు. ప్రధానిని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు నిందించినా ప్రజలు శిక్షిస్తూనే వచ్చారని, ఈసారి కూడా ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని అన్నారు.

## 23న ఎపి ఈసెట్ ప్రవేశ పరీక్ష

మొదటి పేజి తరువాయి..

ఏపీ ఈసెట్ 2026 పరీక్ష ఈనెల 23 గురువారం జరుగనుంది. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు సాయంత్రం సెషన్ రెండు గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏపీ ఈసెట్ చైర్మన్ ,అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య హెచ్ సుదర్శన రావు తెలిపారు. మంగళవారం జేఎన్టీయూ ఆర్యభట్ ఆడిటోరియంలో ఏపీ. ఈసెట్‌ఏ -2026 పరీక్ష లు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం జేఎన్టీయూ ఏపీ ఈసెట్ పరీక్షను పదవ సారి విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏపీ ఈసెట్ 14 విభాగాల్లో నిర్వహించే పరీక్షల కోసం 33,751 మంది అభ్యర్థులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ లో 94 పరీక్ష కేంద్రాలు తెలంగాణలోని హైదరాబాద్ లో ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు ఈ పరీక్ష కేంద్రాలన్నీ కూడా అన్ని జిల్లాల్లోని 47 పట్టణాల్లో ఉంటాయన్నారు. అత్యధికంగా దరఖాస్తులు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ కి 11,924 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 9305, దరఖాస్తులు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కి 5165 అప్లికేషన్లు, మెకానికల్ ఇంజనీరింగ్ కి 412 సివిల్ ఇంజనీరింగ్ కి 2,427 ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ 75 ధరఖాస్థులు, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కి 48, బిఎస్సి గణితం కు 30, సిరామిక్ టెక్నాలజీకి ఒక దరఖాస్తు, మైనింగ్ ఇంజనీరింగ్ 31, ఫార్మసీ 243, మెటలాజికల్ ఇంజనీరింగ్ కి 68 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తుల చేసుకో వడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు గడువు గత నెల 28 తో ముగిసిందని ఆలస్య రుసుము లేకుండా 33,210 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, రూ. 1000 ఆలస్య రుసుముతో అందిన దరఖాస్తులు 286 మంది, రూ. 2000 ఆలస్యరసంతో 200 మంది రూ. 4,000 ఆలస్య రుసుముతో 31 మంది రూ 10,000 ఆలస్యరసముతో 24 మంది, మొత్తం 33,751 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా కూడా ఇప్పటికీ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకున్నట్లు తెలిపారు. హాల్ టికెట్ డౌన్లోడ్ లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఏపీ ఈసెట్ కన్వీనర్ ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈసెట్ కన్వీనర్ ఆచార్య దుర్గాప్రసాద్ కో కన్వీనర్ ఆచార్య భానుమూర్తి రిజిస్టార్ ఎస్. క్రిష్ణయ్య పాల్గొన్నారు.

## మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

మొదటి పేజి తరువాయి..

నుంచి తలపెట్టిన సమ్మెపై ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. సమ్మె కొనసాగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జోక్యం చేసుకోవాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ఇప్పటికీ మొదలుపెట్టలేదు. కాలయాపన కోసమే విలీన కమిటీ వేశారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోతే.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారు.. ఎలక్ట్రికల్ బస్సులతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలి. ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ ఛైర్మన్ వెంకన్న హెచ్చరించారు. సమ్మె ప్రారంభం అవుతున్నా.. ఇప్పటి వరకు ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వం మమ్మల్ని చర్చలకు పిలవలేదని.. సమ్మె నివారణ కోసం కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్న పట్టించుకోలేదని.. అధికారంలోని కాంగ్రెస్ పార్టీ.. తన మేనిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పని పరిస్థితుల్లోనే సమ్మె చేస్తున్నామన్నారు. ఇవి బస్సులు తీసుకొస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తుందని.. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇస్తున్నారని విమర్శించారు జేఏసీ చైర్మన్ వెంకన్న. సమ్మె చేయకుండా కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఎవరు భయపడొద్దని.. కార్మికులు అందరూ సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నారంటూ స్పష్టం చేశారాయన. కాలయాపన కోసమే కమిటీ అంటున్నారని.. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేసిన ప్రభుత్వం.. ఆర్టీసీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు.. ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళ్లటానికి జేఏసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

మొదటి పేజి తరువాయి..

ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన నియోజకవర్గం కొళత్తూరులో చివరి రోజు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే వారికి తానో ప్రమాదకారిని అని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించేందుకు డీలిమిటేషన్‌పై కేంద్రం తీవ్రంగా ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిసామి పశ్చిమ తమిళనాడులో ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినీతి డీఎంకే ప్రభుత్వ పాలనకు ముగింపు పలకాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు ఆయా కూటముల తరఫున రాష్ట్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.


## తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

మొదటి పేజి తరువాయి..

మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఎ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్టక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్టాల్లోన్రూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# ప్రజా సమస్యలు గాలికి వదిలి బలప్రదర్శన దిగిన పాలకపక్షం మరియు ప్రధాన ప్రతిపక్షం

- జీవన్ రెడ్డి చేరిక ద్వార తెలంగాణ ప్రజలతో బిఆర్ఎస్ పార్టీ పేగు బంధం తెగిపోయింది.
- రాజశేఖరరెడ్డి మెప్పు కోసం తెలంగాణ ప్రయోగాలను తాకట్టు పెట్టిన జీవన్ రెడ్డిని బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకోవడం సిగ్గుచేటు.
- రేవంత్ రెడ్డికి ఇన్ని రోజులు గుర్తుకురసని మేడిగడ్డ ప్రాజెక్ట్ ఇంపుడే ఎందుకుగుర్తుకు వచ్చిందో సామధానం చెప్పాలి
- గుంజపడుగు హరిప్రసాద్ జిల్లా అధ్యక్షుడు తెలంగాణ జాగృతి, కరీంనగర్.



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 21,( చట్టం బ్యూరో ) :** కరీంనగర్ నగరానికి చెందిన తెలంగాణ ఉద్యమకారిణి మరియు జాగృతి నాయకురాలు కొమిరి పద్మ. మరియు మనకోండూర్ మండలానికి కొలిపాక గౌతమి ఆద్వర్యంలో పలువురు నాయకులు మహిళల కవితక్కను తెలంగాణ రాష్టానికి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా తెలంగాణ జాగృతిలో పనిచేస్తామని ఈరోజు తెలంగాణ జాగృతిలో చేరడం జరిగింది. వారికి జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువాలు కప్పి సాదరంగా జాగృతిలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 25.న తెలంగాణ ప్రజల ఉజ్వలమైన భవిష్యత్ కోసం కవితక్క నూతన రాజకీయ పార్టీ ప్రారంభిస్తారని అ యొక్క పార్టీలో పనిచేయడం కోసం ఇప్పటికే చాలా మంది ముందుకు వస్తున్నారని ఈ రాష్టంలో ఉన్న జాతీయ పార్టీలను భారతదేశంలో ఉన్న అనేక జాతీయ అంశాలతోపాటు తెలంగాణ ఒకటని కానీ తెలంగాణ జాగృతి కేవలం ఈ రాష్ట్ర ప్రయోగాలే ప్రధాన అజెండా ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారానికే మా కృషి ఉంటుందని వారు అన్నారు. తెలంగాణలో ఉన్న పాలకపక్షం మరియు ప్రధాన ప్రతిపక్షం రెండు జాతీయ పార్టీలే ముఖ్యంగా కేసిఆర్ నాయకత్వంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలతో పేగు బంధాన్ని తెంచుకుని జాతీయ రాజకీయలోకి పోయిందని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కూడ తెలంగాణ ప్రయోగాల విషయంలో పట్టించుకోలేదని. మరో జాతీయ పార్టీ బిజెపికి కూడ ఉత్తర భారతదేశ ప్రయోగాలే ముఖ్యం అని వారు అన్నారు. నిన్నటి రోజున బిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ ఈ రెండు రాజకీయ పార్టీలు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి బల ప్రదర్శన దిగిన సంగతి ప్రజలకు తెలుసని అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలు గుర్తుకురాని మేడిగడ్డ ముఖ్యమంత్రి గారికి నిన్ననే గుర్తుకు వచ్చిందని పోని ప్రాజెక్ట్ సంబంధించిన మంచి విషయాలు కానీ, రైతులకు నీళ్ళు అందించే ముచ్చట ఎదైనా చెబుతాడు కావచ్చు అనుకుంటే కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం అయ్యాడు ముఖ్యమంత్రి. మరి ప్రధాన ప్రతిపక్షం తీరు కూడ అదేవిధంగా ఉంది నిన్న జగిత్యాలలో తెలంగాణకు బద్దవ్యతిరేకి, కేవలం తాను ఒక్కడే ఉండాలి మరెవ్వరూ కూడ ఉండోద్దు అని యువతను రాజకీయంగా అనగదొక్కిన కలం చెల్లిన నాయకుడిని బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని వారి గొయ్యిని వారే తీసుకున్నారు వరుసగా ఓటమిలో హైట్రిక్ కొట్టిన జీవన్ రెడ్డితో బిఆర్ఎస్ కు ఏం లాభం జరుగుతుందో వారే చెప్పాలని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కవితక్క నాయకత్వంలో తెలంగాణ ప్రయోగాల కోసం తెలంగాణలో పేరుకు పోయిన సమస్యల పరిష్కారం కోసం కవితక్క కృషి చేస్తుందని రోజురోజుకు తెలంగాణ జాగృతి ఒక బలపడుతుందని ఈ రాష్ట్రానికి కవితక్క ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

---------

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**- బడిబాట కార్యక్రమం**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో మంగళవారం అయోధ్య, కుమ్మరి పెల్లి, ఉప్పుమడుగు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విస్తృతంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించచారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు గురించి ప్రత్యేకంగా వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు మరియు నాణ్యమైన విద్య గురించి వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, నోటుబుక్కులు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం మాత్రమే కాకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుండి అల్పాహారం మరియు పాలను కూడా అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఆధునిక పద్ధతులతో బోధన అందిస్తున్నారని, డిజిటల్ తరగతులు, స్మార్ట్ క్లాస్‌లు, విద్యార్థి కేంద్రిత బోధన విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో వ్యక్తిగత అభివృద్ధి, నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తున్నారని వివరించారు. గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించడంతో పాటు మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించడం ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టను మరింత పెంచిందని తెలిపారు. ఇది ప్రభుత్వ పాఠశాలలలో అందిస్తున్న నాణ్యమైన విద్యకు



నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్ గౌడ్, మండలోజు రవీందర్, నాగరాజు, శ్రీకాంత్ గౌడ్, పద్మజ, వనిత, తిరుమల, అయోధ్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శైలజ, వనమాల ప్రవళిక, విట్టల్, ఉప్పు మడుగు ప్రధానోపాధ్యాయులు నరసయ్య, ఉపాధ్యాయులు స్వరూప, శిరీష, రాజేశం, లావణ్య, కుమ్మరి పెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లిన వైసీపీ ఎస్సీ సెల్ మండల నాయకులు

**నార్పల, ఏప్రిల్21:(చట్టం) న్యూస్ :** అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ లోఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ నిర్వహించిన ఎస్సీ గ్రీవెన్స్ కార్యక్రమంలో నార్పల మండలంలోని పలు సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాగోళ్ల ప్రభుదాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నార్పల మండల అధ్యక్షులు ప్రభుదాస్, జిల్లా కార్యదర్శి సాకే రామాంజనేయులు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



వినతిపత్రంలో ప్రధానంగా నార్పల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న స్మశాన వాటికలను మరమ్మతులు చేయాలని, స్మశాన వాటికలు లేని గ్రామాల్లో కొత్త వాటికలకు భూమి కేటాయించాలని కోరారు. అదేవిధంగా దళిత నిరుపేద కుటుంబాలకు 5 ఎకరాల భూమి కేటాయించి, ఇంటి స్థలాలతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఎస్సీ, ఎస్టీ కాలనీలలో సబ్ ప్లాన్ నిధుల ద్వారా రహదారులు, తాగునీరు, విద్యుత్, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. నార్పల మండలం పప్పూరు గ్రామంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రహరీ గోడ ఎత్తు పెంచి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పిల్లలకు ప్రమాదకరంగా ఉన్నందున వెంటనే తొలగించి, మరొక సురక్షిత ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సాకే ఆంజనేయులు, బండ్లపల్లి ఆదినారాయణ, మీనుగ రామాంజనేయులు, పెద్దిరాజులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఎస్‌వై నగర్ కాలనీ లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవం

**- ప్రారంభించిన మాజీ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్మం లోకేష్**



**మేడిపల్లి,21 ఏప్రిల్ (చట్టం) :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బొల్లిగూడెం శ్రీ సాయి ఎస్‌వై నగర్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్ల పనులు విజయవంతంగా పూర్తయిన సందర్భంగా రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ మాజీ డిప్యూటీ మేయర్ స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్మం లోకేష్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఇ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు కాంతా రెడ్డి మాట్లాడుతూ కాలనీవాసుల ఇబ్బందులను గమనించిన కిషోర్ గౌడ్ రోడ్ల నిర్మాణానికి పూర్తి సహకారం అందించి, ఈ సీసీ రోడ్ల నిర్మాణం జరగడానికి ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఇందుకు కాలనీవాసులు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా కాలనీలో ఇంకా కొన్ని రోడ్లు నిర్మాణం కావాల్సి ఉన్నందున, అవి కూడా త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా మనవి చేయడం జరిగింది. అనంతరం కిశోర్ గౌడ్ మాట్లాడుతూ రెండు నెలలో పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ గిరి కొండపల్లి, కోశాధికారి జి.సత్తయ్య, అక్బర్, మహాలక్ష్మి కాలనీ అధ్యక్షులు రూపం విష్ణు కాలనీ పెద్దలు బాలకృష్ణారెడ్డి, మునీర్ హైమద్, సూర్య ప్రకాష్ రావు, ప్రసాద్, రాజి రెడ్డి, ఎల్లారెడ్డి, జోజయ్య, సత్యనారాయణ, లక్ష్మీ నారాయణ సాయిలు, రవి యాదవ్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో విద్యార్థులకు పోటీలు

**ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు**




**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 21,( చట్టం బ్యూరో) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు విద్యాలయాల్లో విద్యార్థులకు మంగళవారం పోటీలు నిర్వహించారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు, గురుకుల విద్యాలయాలు, ఇతర రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చిత్రలేఖనం, క్విజ్, డిబేట్ ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి.. అభినందనలు తెలియజేశారు. కార్యక్రమాల్లో ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కో ఆప్షన్ ఎన్నికలకు నాలుగు స్థానాలకు రెండు ఏకగ్రీవం రెండింటికి పోటీ

**భూధాన్ పోచంపల్లి ; ఏప్రిల్ 21 (చట్టం ప్రతినిధి)**

పురపాలక సంఘం కార్యాలయం కో ఆప్షన్ ఎన్నిక ప్రక్రియ భాగంగా మంగళవారం నామినేషన్ ప్రక్రియ ముగిసింది . పురపాలిక ప్రత్యేక పరిజ్ఞానం లేదా అనుభవం కలిగి ఉన్న ఇద్దరు సభ్యులకు గాను జనరల్ స్థానానికి మద్ది మధుసూదన్ రెడ్డి , బండారు ప్రకాశ్ రెడ్డి మహిళ సభ్యులకు సంగం లలిత , బోడ రమాదేవి నామినేషన్లు సమర్పించారు . అల్ప సంఖ్యాక వర్గాలకు ఇద్దరు సభ్యులకు గాను జనరల్ స్థానానికి సయ్యద్ ఎజాజ్ మహిళా స్థానానికి మహమ్మద్ రసూల్ దరఖాస్తులు దాఖలు అయినట్లు పురపాలిక కమిషనర్ అంజన్ రెడ్డి తెలిపారు . అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన రెండు స్థానాలకు గాను రెండు నామినేషన్లు రావడంతో దాదాపు ఏకగ్రీవమైనట్లే..

# స్తంభంపల్లి బాలుర గురుకులంలో ఉత్సాహంగా 'ప్రజాపాలన' పోటీలు




**వెల్గటూర్,21 (చట్టం):** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలశీ స్తంభంపల్లి గ్రామంలోని ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఎస్ (మహాత్మా జ్యోతిబాపూలే) బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించగా.. వారు చురుగ్గా పాల్గొని తమ అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ హరిత మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, వారి ప్రతిభను సానబెట్టేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. పాఠశాలలో ఇటువంటి విద్యాపరమైన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేసి, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ రహీం, డీడబ్ల్యూ దివ్య, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బోయిన్ పల్లి బస్టాండ్ లో చలి కేంద్రం ప్రారంభం




**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 21 ,(చట్టం బ్యూరో) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నల్ల మోహన్ వార్డు సభ్యులతో కలిసి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండాకాలం కావడం తో ప్రజల దాహార్తి తీర్చేందుకు బస్టాండ్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ పనులకోసం మండల కేంద్రానికి వచ్చే వారికి, ప్రయాణికులకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందని అన్నారు. అనంతరం గ్రామంలో వేసవిలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్తగా గ్రామంలోని రైతుల బావులనుండి మీరు తీసుకొని గ్రామంలో సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా పలు భావులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనిల్, ఉప సర్పంచ్ మెరుపుల చందన జలంధర్ గౌడ్, వార్డు సభ్యులు బొజ్జ నరేందర్, దూస శ్రీనివాస్, నాయకులు మెరుపుల గంగాధర్, వాసల శ్రీనివాస్,బొడ్డు తిరుపతి, భీమనాథ రమేష్, తదితరులు ఉన్నారు.

# నూతన తహసీల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్, వార్డ్ మెంబర్స్.



**పెగడపల్లి, ఏప్రిల్ 21( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల నూతన తాసిల్దార్ సయ్యద్ నిజాముద్దీన్,ను మర్యాదపూర్వకంగా కలిసిన అయితుపల్లి సర్పంచ్, వార్డు మెంబర్స్.

# నార్పల మండల ఏపీటీఎఫ్ 1938 నూతన కమిటీ ఎన్నిక




**నార్పల ఏప్రిల్ 21, (చట్టం) న్యూస్ :** అనంతపురం ఎన్జీవో హోమ్ నందు నార్పల మండలం ఏపీటీఎఫ్ 1938 నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా యమ్. నరసింహులు, మండల అధ్యక్షులుగా యమ్. నాగిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జి. వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా రమేష్ నాయక్, వరలక్ష్మి, కార్యదర్శులుగా పి. గుప్త, బి. చింతలరెడ్డి, వెంక నాయక్, రేణుక, జిల్లా కౌన్సిలర్ గా డి. ఆంజనేయులు, జి. హనుమంతు, ఏ. నాగార్జున, బి. రమేష్ రెడ్డి లు ఎన్నికయ్యారు. వీరికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన ఏపీటీఎఫ్ 1938 నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమస్యలపై పోరాటం చేయడంతోపాటుగా, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునే దిశగా కృషి చేయడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

**రైతులను హెచ్చరించిన అధికారులు**

**క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన**

**రంగారెడ్డి,ఏప్రిల్21 :** ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

## అప్పుడు కెసిఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు

**ఎటిఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్**

**రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు**



హైదరాబాద్,ఏప్రిల్21 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్

**పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు**

**బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ**

**రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష**



నల్గొండ,ఏప్రిల్21 : అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్చిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమెప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

# సమ్మె ఆలోచన విరమించండి

- **చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే**
- **ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి**
- **విభజనపై ఎంపి తేజస్వీ వ్యాఖ్యలపై చంద్రబాబుకు లేఖ**



**హైదరాబాద్,ఏప్రిల్21 :** టీజీఎస్‌ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెను వెంటనే విరమించాలని వారికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మీ సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కార్మికులకు ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసి బలోపేతానికి తాము కృషి చేస్తున్నామని అన్నారు. కార్మికులు ప్రయాణికుల దృష్టిలో ఆలోచించాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికిప్పుడు చర్చకు తాము సిద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు వద్దంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొనడం బాధాకరమన్నారు. హైడ్రాను రద్దు చేస్తామంటే కబ్జాదారులకు మద్దతు ఇవ్వడమేనని మంత్రి పొన్నం అభిప్రాయపడ్డారు. జగిత్యాలలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ భారీ సభను నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రాను రద్దు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి వద్దని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం పట్ల పొన్నం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే రాష్ట్ర విభజనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎవరికీ మంచిది కాదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. భాజపా, తెదేపా నేతలు, జనసేన అధినేత వ్యాఖ్యలు సముచితంగా లేవు. రాష్ట్ర విభజన అనుచితంగా జరిగినట్లు చేసే వ్యాఖ్యలు విద్వేషాలు రగిలించేలా ఉన్నాయి. మీరు చొరవ తీసుకుని నేతలకు సర్దిచెప్పాలి. విభజనపై ఎంపీ తేజస్వి వ్యాఖ్యల విషయమై స్పీకర్‌కు లేఖ రాయాలి. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చూడాలి. రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం అని లేఖలో పొన్నం పేర్కొన్నారు. తన వినతిని అర్థం చేసుకుని తగిన విధంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

**రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి**

హైదరాబాద్,ఏప్రిల్21 : తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్దలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

## ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

- **కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు**
- **హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది**
- **కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు**
- **కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్21 :** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది. ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరఫున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు.జగిత్యాలలో బీఆర్ఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,ఏప్రిల్21 :** తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

## తమిళనాడు తీరప్రాంతానికి వర్షహెచ్చరిక

**చెన్నై,ఏప్రిల్21 :** తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల తీరప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఉత్తర కర్ణాటక నుంచి రాష్ట్రం మీదుగా మన్నార్‌వలైకుడ వరకు ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ కారణం గా, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, దక్షిణ జిల్లాల సముద్రీతీరప్రాంతాల్లో మంగళ, బుధవారా ల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. తూణరాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో ఈ నెల 23వ తేది వరకు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ట ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

**95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి**

**హైదరాబాద్,ఏప్రిల్21 :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ

**ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం**



**జనగామ,ఏప్రిల్21 :** సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మబలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

# రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సొసైటీలో అవకతవకలు





### ఎగ్జిక్యూటివ్ సభ్యుల సామూహిక రాజీనామా...

**రాంపల్లి,21 ఏప్రిల్ (చట్టం) :** మెడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలోని రాంపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ 4వ బ్లాక్ సొసైటీలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. సొసైటీ వ్యవహారాల్లో పారదర్శకత లేకపోవడం, అనధికారిక వ్యక్తుల జోక్యం పెరగడం వంటి అంశాలను వారు ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. సుమారు ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన ఈ సొసైటీలో వైస్ చైర్మన్, ట్రెజరర్, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన వారు ప్రస్తుతం తమ బాధ్యతలు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సొసైటీ చైర్మన్ స్వయంగా పనులు నిర్వహించకుండా, ఆమె కుటుంబ సభ్యులు --- భర్త, కొడుకు, అల్లుడు --- అధికారిక హోదా లేకపోయినా సొసైటీ కార్యకలాపాలను నడుపుతున్నారని ఆరోపించారు.

అదనంగా, ప్రతి కుటుంబం నుండి రూ.500 లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో మెయింటెనెన్స్ వసూలు చేస్తున్నప్పటికీ, ఆ నిధుల వినియోగంపై ఎలాంటి స్పష్టత లేదని నివాసితులు అంటున్నారు. భవనాల నిర్వహణ సరిగా జరగకపోవడంతో పాటు, సొసైటీ నిధులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ అంశంపై సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల దృష్ట్యా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు తమ పదవులకు తక్షణమే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఇదే సందర్భంగా వారు జిల్లా సహకార అధికారిని ఆశ్రయించి తమ రాజీనామాలను ఆమోదించడంతో పాటు, సొసైటీ వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అలాగే, అనధికారికంగా సొసైటీని నిర్వహిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడం, పారదర్శకంగా కొత్త కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా నివాసితుల హక్కులను రక్షించాలని విజ్ఞప్తి చేశారు.

# దళితులకు అసైన్మెంట్ భూములు పంచాలి,

### ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్





**నార్పల ఏప్రిల్ 21, (చట్టం) న్యూస్ :** కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ లోఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ గారు నిర్వహించిన ఎస్సీ గ్రీవెన్స్ కార్యక్రమంలో నార్పల మండలంలో పలు సమస్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్పల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న స్మశాన వాటికలను మరమ్మతులు చేయాలని, స్మశాన వాటికలు లేని గ్రామాల్లో కొత్త వాటికలకు భూమి కేటాయించాలని . అదేవిధంగా దళిత నిరుపేద కుటుంబాలకు 5 ఎకరాల భూమి కేటాయించి, ఇంటి స్థలాలతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో సబ్ ప్లాన్ నిధుల ద్వారా రహదారులు, తాగునీరు, విద్యుత్, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు . నార్పల మండలం పప్పూరు గ్రామంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రహరీ గోడ ఎత్తు పెంచి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అలాగే నార్పల మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పిల్లలకు ప్రమాదకరంగా ఉన్నందున వెంటనే తొలగించి, మరొక సురక్షిత ప్రాంతానికి మార్చాలని పలు డిమాండ్ల మీద వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు మండల నాయకులు సాకే ఆంజనేయులు, బండ్లపల్లి ఆదినారాయణ, మీనుగ రామాంజనేయులు, పెద్దిరాజులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్.



**పెగడపల్లి, ఏప్రిల్ 21( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని దేవికొండ, నంచర్ల, రాములపల్లి లోని రాంనగర్ లో నంచర్ల పిఏసిఎస్ ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యపు కొనుగోలు సెంటర్లను స్థానిక సర్పంచులు కుంటాల వనజ- శ్రీనివాస్,నామ సురేందర్రావు, అమిరిశెట్టి లక్ష్మీనారాయణ,తో కలిసి ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, అనంతరం మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని అదేవిధంగా కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని అలాగే రైతులు సేద తీర్చుకోవడానికి గుడారాలు లేదా గుడిసెల లాంటివి వేసి రైతులకు సహకరించాలని అన్నారు

ఈ కార్యక్రమంలో సీఈవో రౌతు మధుకర్,ఉప సర్పంచ్ శ్యామ్ సుందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెట్ల కిషన్, అజ్మీర అంజినాయక్, నాయకులు కడారి తిరుపతి,తోట మల్లేశం, లైసెట్టి శంకరయ్య, గాజుల నగేష్,బుర్ర తిరుపతి గౌడ్,నీరటి రాజ్ కుమార్,బుర్ర ప్రవీణ్ గౌడ్ , మోతె మల్లారెడ్డి చెట్ల రాజు ఉన్నారు





# ప్రణాళిక ప్రకారం పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారితో మాట్లాడిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ;



**ఉమ్మడి కరీంనగర్ జిల్లా / ఏప్రిల్ 21,( చట్టం బ్యూరో ) :** పోటీ పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు యువత, అభ్యర్థులు సిద్ధమవుతుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ వారితో మాట్లాడారు. విద్యార్థతలు, ఏ ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నారు? ఏ ఏ పుస్తకాలు చదువుతున్నారు? ఆరా తీశారు. రోజా ఎంత మంది లైబ్రరీకి వస్తారని గ్రంథాలయ అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అన్ని సబ్జెక్టులు ప్రణాళిక ప్రకారం.. ప్రతి అంశం క్షుణ్ణంగా చదవాలని సూచించారు. కరెంట్ అఫైర్స్, ఇతర అన్ని అంశాలపై మంచి అవగాహనతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఎన్సీఈఆర్టీ పుస్తకాలు కూడా రిఫరెన్స్ గా తీసుకోవాలని సూచించారు.

# ఎంపీపీస్ పాఠశాల వార్షికోత్సవము ఘనంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు.




**పెగడపల్లి ఏప్రిల్ 21 ( చట్టం న్యూస్ ):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిధిలోని అయితుపల్లి గ్రామంలో ఎంపీపీస్ పాఠశాల వార్షికోత్సవము వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు. ఈ కార్యక్రమం లో చిన్న పిల్లల ఆట పాటలు చాలా ఆకర్షించాయి. ఈ కార్యక్రమనికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబెర్స్, ఏఎంసీ డైరెక్టర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,పిల్ల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# కరీంనగర్ డైరీ నిర్వాహకులు పాడిరైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ పాలు కింద పోసి నిరసన





**బోయిన్ పల్లి మండలం / ఏప్రిల్ 21,( చట్టం న్యూస్) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన పాల కేంద్రంలో గ్రామంలోని దాదాపు 70 మంది పాడి రైతులు ఉదయం సాయంత్రం పాలను కేంద్రంలోకి తీసుకెళ్లి విక్రయిస్తుండగా గత కొన్ని నెలల క్రితం నుండి వెన్న శాతం తక్కువ వస్తుందని చెప్తూ తక్కువ ధర చెల్లించడం తో పై అధికారులకు పిర్యాదు చేయగా పాల సేకరణ యంత్రం మరమ్మత్తు చేయించి ఇక నుండి సమస్య రాదు అని చెప్పగా కేవలం నాలుగు రోజులు మాత్రమే పాలను తీసుకొని సరైన డబ్బులు చెల్లించారని మళ్ళీ రెండు రోజుల నుండి మళ్ళీ వెన్న శాతం రావడం లేదని డబ్బులు తక్కువ ఇవ్వడం తో ఆగ్రహం చెందిన పాడి రైతులు పాల కేంద్రం వద్ద నిరసన తెలిపి పాలను పారబోసి రైతులను మోసం చేస్తున్న కరీంనగర్ డైరీ పై చర్యలు తీసుకోవాలని కోరారు.కాగా అక్కడికి వచ్చిన సూపర్ వైజర్ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళతాని చెప్పారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల







**రాయికల్ ఏప్రిల్ 21 చట్టం :** రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ "తరంగిణి - 2026"వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్లో పాఠశాల డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జూపల్లి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ పాఠశాలల్లో వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులలోని ప్రతిభ పాటవాలు వెలికి తీయడానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్న శిఖరాలను అధిరోహించాలని, సోషల్ మీడియాలకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్న ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్న ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు తల్లిదండ్రుల పెంపకం చాలా ముఖ్యమని అన్నారు. వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు పలు సందేశాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రమ్స్, గిటార్ , పియానో, డ్యాన్సులు, పౌరాణిక దేశభక్తి నృత్యాలతో పలువురిని అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జూపల్లి తిరుపతిరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండలో ప్రయాణికులు




**కొడిమ్యాల, ఏప్రిల్ 21(చట్టం) :** కరీంనగర్, జగిత్యాల 563 జాతీయ రహదారి పై గల మండలంలోని పూడూర్ బస్ స్టాప్ నుండి వివిధ ప్రాంతాలకు వివిధ అవసరాల నిమిత్తం వెళ్ళే ప్రయాణికులు బస్సుల కోసం మండుటెండలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఇక్కడి నుండి వేలాది మంది ప్రయాణికులు ఏండ్లుగా ప్రయాణాలు చేస్తున్నా ఇక్కడ ప్రయాణ ప్రాంగణం కరువైంది. ఫలితంగా ప్రయాణికులు బస్సులు వచ్చే వరకు రోడ్డుపై గల దుకాణాలు, టేలాలు, ఎక్కడ నీడ ఉంటే అక్కడ నిలబడి ఎండ బారీ నుండి రక్షణ పొందుతున్నారు. కొడిమ్యాల వైపు వెళ్ళే దారిలో ఉన్న ప్రయాణ ప్రాంగణం అది కేవలం కొడిమ్యాల వైపు వెళ్ళే ప్రయాణికులకు మాత్రమే ఉపయోగకరంగా ఉంది. కనుక సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణికుల ప్రస్తుత ఎండాకాల, మున్ముందు వర్షాకాల అవస్థలను అర్థం చేసుకొని తగిన వసతి కల్పించాలని ఆ దారి గుండా వెళ్ళే ప్రయాణికులు కోరుతున్నారు.-



చట్టం సాహితీ లోకం 95814 19999

## అమ్మ నిజం - బ్రహ్మ పురాణం



మన జన్మకు అమ్మే ప్రధానం
బ్రహ్మ కథ పుక్కిటి పురాణం

మన జన్మకు నాన్న తోడైతే
అమ్మ మనకు జన్మనిచ్చింది

అమ్మ నాన్నలు లేకుంటే
మనకు జన్మంటూ లేనే లేదు

బ్రహ్మను కన్నది కూడా
ఒక అమ్మని గుర్తుంచుకో

పుక్కిటి పురాణాలు
కట్టు కథలు నమ్మవద్దు

నాన్న జన్మకు తోడైతే
అమ్మ మనకు జన్మనిచ్చింది

అవనికి సృష్టి బ్రహ్మ కాదు అమ్మే జన్మకు ప్రధానం

అమ్మ లేకుండా పుట్టిన వాళ్లు
ఈ సృష్టిలో ఎవరైనా ఉన్నారా

పుక్కిటి పురాణాల్లో తప్ప
అమ్మ లేకుండా
పుట్టి వాళ్ళు లేనే లేరు

మనకు జన్మనిచ్చిన అమ్మను
అన్నం పెట్టి ఆదరించండి

మన జన్మకు తోడైన నాన్నను
అన్నం పెట్టి గౌరవించండి

పురాణాలను నమ్మకండి
బ్రహ్మ కన్నా అమ్మే మిన్నని
ప్రతి ఒక్కరూ గమనించండి

సృష్టికి మూలమైన స్త్రీలను
జన్మకు తోడైన
మగవాళ్లను మనం గౌరవిద్దాం

బ్రహ్మను మించినది అమ్మ
సృష్టికి మూలం అమ్మ
....................................

రచన సౌపాటి ప్రభాకర్
బ్రాహ్మణ కోడూరు గ్రామం
తెలుగు తేజం,సాహితీ రత్న
నంది అవార్డుల గ్రహీత
చరవాణి 81 84 97 44 60

చట్టం సాహితీ లోకం 95814 19999

## ప్రగల్భాలు



డబ్బాలు పబ్బాలు
సుత్తి సుదారాలు
మ్యాటర్ లేకున్నా మాటల
కోటలు దాటుతాయి
తిమ్మిని బమ్మిని చేసే
గాలి మేడలు కట్టే
గప్పాలు గంగిరెద్దు లా
గాండ్రింపులు
కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు
సూక్ష్మం సుదీర్ఘంగా
కనికట్టు మణికట్టు
మసి పూసి మారేడు కాయ
చూపుతూ
స్వార్థం అసమర్థత
కానరాని దాగుడు మూతలు
చెప్పేవి శ్రీరంగ నీతులు
చేసేది శూన్యం
అవలీలగా అవతరించెందుకు

అదృష్టం నమ్ముకొని
ఆడంబరం తో ప్రతి క్షణం
పై పై మెరుగులతో
ప్రగల్భాలు పలికే శుంటలు
ఎందరో మరెందరో ...

డి చాంద్ బాషా రచయిత

చట్టం సాహితీ లోకం 95814 19999

ప్రపంచ ధరిత్రి దినోత్సవం నేడు
22-4-2026:

## పుడమిని రక్షిద్దాం గేయం



**ఓ మనిషీ మేలుకో....**
**మేలుకో మేలుకో**

ఓ మనిషీ మేలుకో ఓ మానవా మేలుకో..
మేలుకొని నిన్ను నీవు ఏలుకో
ధరణి మాత పై ధగ ధగలుఆపుకో
నీ జీవన కాలం పెంచుకో.......... ఓ మని షీ మేలుకో

అవనికి అందం హరితం
పుడమి తల్లి పరవశం
తరువుల పెంచుట మోదం
తరువుల తరుగుట ఖేదం....... ఓ మని షీ మేలుకో.

పుడమితల్లికి పసిమి పచ్చని బహుమానం
పచ్చని చెట్లను త్రుంచుటతీరని ద్రోహం
సకల జీవుల కది నరక సమానం
జీవవాయువు అందక వచ్చును మరణం... ఓ మనిషీ.

అప్పటి కరోనా కాలుని హోమం
ఎన్నో ప్రాణాలు పోయిన వైనం
మానవ తప్పిదమున్నా మౌనం
ఓ మనిషీ ఎందుకు ఈనిర్లక్ష్యం.... ఓ మనిషీ మేలుకో

ప్రతి బిడ్డా నాటాలి ఓ మొక్క
ప్రతి చోటా ఉండాలి ఎంచక్కా
ధరణి రక్షణ కు కావాలి కఠిన చట్టం
ధరణి మాతకు పట్టాలి హరిత ఛత్రం... ఓ మనిషీ మేలుకో..

డాక్టర్ కవి కోకిల కొఠారి వెంకటరత్నం.
, కవి, రచయిత విశ్రాంత ఉపాధ్యాయుడు,
వి కోట.
చిత్తూరు జిల్లా
9000169823.

చట్టం సాహితీ లోకం 95814 19999



## హాయిని గొలిపే చంద్రిక


దివిలో ప్రకాశిస్తుంది అందాల చంద్రిక
హాయిని గొలుపుతూ మనకు కల్పిస్తుంది ఒక వేదిక
కవుల కల్పనలో తనకంటూ ఉంది ఓ సాధికారత
నులివెచ్చని ముచ్చట గొలిపే నవ మల్లిక

భువిపై వెలుగులు నింపుతూ చక్కగా
మనకు సంతోషాలు దక్కగా
వెన్నెల నింపుతుంది పక్కాగా
ఆనందాన్ని పంచుతుంది అలవోకగా

వెన్నెల రాత్రులలో సుగంధాల విరి పువ్వులు
మనసులో ఆనందపు మొలకలు
మురిసిపోతుంటాయి కాసారంలో కలువలు
అలా చూస్తూ ఉంటే కనిపిస్తాయి వాటి నవ్వులు

మనలో కలిగిస్తుంది సిరి సంపదలు
చంద్రుడు మనకు బంధువు అన్న భావనలు
ఎందరో జన్మించారు కారణజన్ములు
అందరిలోనూ ఒకేలా ఉండేవి అభిప్రాయాలు

పేరు:- రవీంద్రబాబు అరవా
ఊరు:- హైదరాబాద్



చట్టం సాహితీ లోకం 95814 19999

## నాకు ఇష్టం.

నేను వెళ్ళే దారిలో కనిపించే నలుగురు నాకిష్టం.
దారి పక్కన ఆడుతున్న పిల్లల కేరింతలు నాకిష్టం.
వేసవి కాలం తదుపరి పడే తొలకరి చినుకుకు తడిసి,
నేలతల్లి వెదజల్లే అదో రకమైన పరిమళాలు నాకిష్టం.
అందమైన పూలతోటలో రంగురంగుల పూలు నాకిష్టం.
పూల మధ్య తిరుగుతూ, మకరందం సేకరించే తుమ్మెద నాకిష్టం.
పొద్దస్తమానం పొలంలో కష్టపడే రైతుల చెమట వాసన,
కండలు కరిగేలా కష్టపడి లోకానికి తిండి పెట్టే కర్షకులు,
వారి తీరని బాధలు బహు కష్టం. తీరదు కదా వారి కష్టం.
పచ్చని వృక్షాల మధ్య ఆనందంగా నర్తించే నెమలి నాకిష్టం.
నెమలి పురివిప్పి నాట్యం చేసేటపుడు, అందాల శిఖి మరీ ఇష్టం.
జలజల జాలువారే జలపాతాల ఝురుల కింద సేదతీరుట నాకిష్టం.



దోపిడి, దౌర్జన్యం అసలే లేని నవలోకం నాకు ఇష్టం.
ఏ విధమైన భయం లేకుండా సామాన్యుడు బతకడం నాకిష్టం.
మనసుకు అలసట తీర్చి, సాంత్వన కలిగించే గానం నాకిష్టం.
సమాజంలో మార్పు కోరి, కవుల మనసు నుంచి రాసే కవిత నాకిష్టం.
అడుగడుగున మార్చే వంచన మాటలతో,
కాసిని డబ్బు కట్టల కోసం
పదేపదే ముసుగులు మారుస్తూ, జీవితాన్ని ఒక నాటకంగా మార్చుకున్న
మోసగాళ్ళంటే బహు కష్టం. నవ్వుల వెనుక దాగిన విషం మరీ కష్టం.
గలగలా పారే సెలయేటి సవ్వడులు అంటే నాకు మరీ ఇష్టం.
అనురాగం కలబోసి, కాస్త కసురుకుంటూ పెట్టే అమ్మ చేతి ముద్ద నాకిష్టం.
ఇంటి పని అంతా చేసి అలసిపోయినా, తను తినడం కూడా మరిచిపోయి
నవ్వుతూ,అందరి ఆలనా పాలనా చూసే మా ఇంటావిడ నాకు మరీ ఇష్టం.
ఆడవారి శ్రమను హేళన చేసే తెలిసీ తెలియని అభాగ్యులను చూస్తే కష్టం.
కష్టాలు, ఇష్టాలు, నష్టాలు, అరిష్టాల జీవితాన్ని కాష్టం చేరేవరకు ఆనందించడం నాకిష్టం.

రచన: ముక్కా సత్యనారాయణ
పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా

## చేతకాని వాడు!

అంత సీరియస్ ఏమిటో!
అయితే ఎవరికో మూడింది
అన్నమాట!
జమ కట్టారుగా ఎవరినో
చవట కింద!
చివరికంటా వినడం నీకు
అసలు లేదుగా!
నిజాలు కొన్ని గొంతు
దిగవులే!


లౌక్యం తెలియదు!
పాత కాలం మనిషి!
ముందు చూపు అసలు
లేదు!
పిచ్చి మాలోకం!
ఇంతెందుకు అతడు
చేతకాని వాడు!

దీపం వుండగనే చక్క
బెట్టుకోవాలా!
మడి కట్టుకుని కూచుంటాడు!
వెర్రిబాగుల మనిషి!
ఈ కాలంలో పుట్టాల్సింది
కాదు!
కట్టుకున్నది,పిల్లలూ వున్నారా!
ఒక పట్టాన ఎక్కించు కోడు!

తోటి వారి బ్యాంక్ బ్యాలన్స్
కొండంత!
మనవాడి లోన్ ఖాతా చెంతాడు!
స్థిరాస్థి పాడా! అద్దె కొంప!
కిరాణా బాకీ, చేబదుళ్ళ ఇబ్బడి
ముబ్బడి!
దిగి వచ్చాడు సత్య హరిశ్చంద్రుడు!

లంచం మహా పాపమట!
అసత్యం నరకమట!
నీతి తప్పడు,నింద
పడడట!

చట్టం సాహితీ లోకం 95814 19999



ఇంత గొప్పవాడికి దక్కిన
బిరుదు!
అసమర్థుడు,చేతకాని
సన్నాసి!

చివరికి మిగిలిన ఆస్తి!
ఆలిమెడలో నల్లపూసలు
పసుపు తాడూ!
పెళ్లీడు వచ్చిన ఇద్దరు
అమ్మాయిలు!
ఇంకా బాడుగ ఇల్లే!
లోకం దృష్టిలో అసమర్థుడు!
న్యాయానికి,ధర్మానికి పట్టం
కట్టిన ఆ చేతకాని వాడే
నిఖార్సైన నీతిమంతుడు!

రచన: బాచిరాజు సత్యనారాయణ రావు,
(బా. స.రా)
విజయవాడ.

చట్టం సాహితీ లోకం 95814 19999


## అక్షర గుట్టు :



కవిత్వమెట్టు?
మెదడు
మనసున
మెదలీడు
ఆలోచనలు
హృదయంబు
నిల్వవుండు
భావంబులు
కాగితం పై
కదలిడు
పదములు
అక్షర కలములై
సాగుతుండు..
వచనములై
ప్రాకుతుండు
మానవ
జీవితమందు
ఇదే కవిత్వంబు
విత్తనములై
మొలకెత్తుతుండు..
పువ్వులై
పరిమిళిస్తుండు..
కాయలై
రూచిలిస్తుండు..
కవిత్వం
మానవజీవితమందు..
మధుర జ్ఞాపకమై మిగిలిపోతుండు...
ఈ లోకమందు..
ఇదే అక్షర గుట్టు
కవిత్వమిట్లుపుట్టును..
తెలంగాణ కేసర..!

డా, కందుల సుధాకర్
తెలంగాణ కేసరి,
సోషల్ రిఫార్మర్
సేవారత్న,
స్వర్ణ నంది అవార్డు గ్రహీత,
మానవ విలువల సందేశకుడు,
ఖమ్మం జిల్లా 9390708322.

చట్టం సాహితీ లోకం 95814 19999



## అమ్మరా!
## పర:బ్రహ్మరా!

పల్లవి:
అమ్మరా!
అమ్మరా!అమ్మరా!
అమ్మెవరో!
కాదు!ఆ బ్రహ్మరా!
అమ్మెవరో!
కాదు!పర:బ్రహ్మరా!
అ.ప:
బ్రహ్మే!సృజియించిన
మన అమ్మరా!
ఆ అమ్మంటే! ఎందుకంత? చులకనరా!
అమ్మకు!నువ్వే!
ఆరోప్రాణంరా!
"అమ్మరా"
చ:1
నాన్ననుండిబొట్టుగా,,
అమ్మలో అదిబిడ్డగా,,2
నవమాసాలూ మోసిన అమ్మరా!
నిన్నిలకు పంపించిన
దేవతరా!
నీకు జన్మనిచ్చి మళ్ళీ
బ్రతికింది రా!
"అమ్మరా"
చ:2
అమ్మ ప్రేమ అద్భుతం!
అమ్మ త్యాగ మమోఘం!2
అమ్మ దీవెనెంతో సౌభాగ్యంరా!
ఆ భాగ్యం పొందిన
నువ్వు ధన్యుడురా! అంతటి!
ఆ అమ్మను నువ్వు మరవకురా!
"అమ్మరా"

రచన:
"వాగ్గేయరత్న"
డా.కడివేటి మునిరత్నం,
రచయిత, అంతర్జాతీయ గాయకులు,
తిరుపతి.



# చట్టం సాహితీ లోకం

95814 19999

## కాలం విలువ తెలుసుకో!



కాలం ఎంతో విలువైనది
కాలాన్ని వినియోగించే తీరు
సరిగ్గా ఉంటే తప్ప
మిగిలిన పనులు సరిగ్గా జరగవు
కాలం డబ్బు కంటే విలువైనది
దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన
అవసరం ఎంతో ఉంది
కాలం పోతే తిరిగిరాదు
కాలం, కెరటం అనేవి
ఎవరికోసం ఎదురు చూడవు
కాలం అన్నింటిని పరీక్షిస్తుంది
కాలం అన్నింటిని పొందుతుంది
కాలం అన్నింటిని మింగేస్తుంది
కాలం చాలా వేగ వంతమైనది
కాలాన్ని వస్తువులాగా
ఎక్కడా నిల్వ ఉంచలేవు
ప్రపంచంలో ఉన్న మొత్తం
ధనం దారపోసినా సరే
కాలాన్ని తిరిగి పొందలేం!
బంగారాన్ని వెచ్చించినా సరే
కాలాన్ని మాత్రం కొనలేం
కాలం విలువ తెలుసుకోలేకపోతే
మనుషులను మందగమనులుగా
సమయపాలన లేని వారిగా
బద్ధకస్థులు తయారు చేస్తుంది
అందుకే... మనం కాలాన్ని
నిర్ణయాత్మకంగా
వినియోగించడంలో
ప్రకృతితో మమేకమవ్వడం
ప్రధానమైన అంశమని గుర్తించుకో!

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
చరవాణి : 9866179385

# చట్టం చిత్రం

# జైలర్-2 షూటింగ్ పార్ట పూర్తి


## కేక్ కట్‌చేసి సెటబ్రేషన్ చేసుకున్న యూనిట్






సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు. దీంతో అభిమానులు రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, రమ్య కృష్ణన్, మిర్నా మీనన్, యోగి బాబు వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే 'జైలర్ 2' షూటింగ్ పూర్తవడంతో, ఇప్పుడు అందరి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు రిలీజ్ డేట్‌పై ఉంది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# జూన్ 11న డ్రాగన్ మూవీ విడుదల




ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు

## నటి కాయదు లోహార్ సంచలన నిర్ణయం






తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

# 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల



కాళీ క్రాఫ్ట్స్ మరియు నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ దయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉందని, ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా అవి విడుదల కాలేదని, ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు. నటి సుజాత దీక్షిత్ మాట్లాడుతూ, తన నిజస్వరూపానికి భిన్నంగా ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఉంటూ కళ్ళతో పలికించే పాత్రను దర్శకుడు తనతో చేయించారని తెలిపారు. హీరోయిన్లు యానీ దయానా, దివ్య విశ్వకర్మ తమకు తెలుగు రాకపోయినా చిత్ర బృందం ఎంతో సహకరించిందని, ఇదొక మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు. బలగం సత్య, లిరిసిస్ట్ రాంబాబు గోసాల కూడా చిత్ర విజయానికి తమ ఆకాంక్షలను తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను పలకరించనుంది.

# శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ




మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో 'వేద్' వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు

# చట్టం స్పోర్ట్స్

# టీమ్ఇండియాలో చోటు కోసం పెరిగిన పోటీ




ఐపీఎల్ వచ్చినప్పటి నుంచి టీమ్ఇండియాలో చోటు కోసం పోటీ ఎక్కువైంది. ఈ దేశవాళీ టోర్నీమెంట్?లో రాణించి అనేకమంది కుర్రాళ్లు తమ సత్తాను ప్రపంచానికి చాటుకున్నారు. దీంతో ఆయా ప్లేయర్లను జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. అయితే ఇది సెలక్టర్లకు సవాల్?గా మారింది. ఎవరిని ఎంపిక చేయాలి? అనేది కష్టంగా మారింది. ఒక్కోసారి ఈ విషయంలో సెలక్షన్ కమిటీ పలుమార్లు విమర్శలు ఎదుర్కొంటోంది. అందుకే బీసీసీఐ కొత్త ప్లాన్ చేస్తున్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.ప్రస్తుతం ఫామ్?లో ఉన్న ఆటగాళ్ల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. అందుకే 30 నుంచి 35 మంది ఆటగాళ్లతో రెండు టీ20 జట్లు తయారు చేయాలని బీసీసీఐ ఆలోచిస్తుంది. ఈ మేరకు సెలక్షన్ కమిటీ ఓ జాబితా తయారు చేస్తున్నందని టాక్ వినిపిస్తుంది. దీంతో ఒకే సమయంలో మన రెండు జట్లు వేర్వేరు ప్రత్యర్థులతో ఒకేసారి బరిలో దిగవచ్చు. ఈ విధంగా బీసీసీఐ ప్లాన్ చేస్తుంది. అటు అంతర్జాతీయ ద్వైపాక్షిక సిరీస్?లు, మరోవైపు ఆసియా గేమ్స్? లాంటి ప్రతిష్ఠాత్మక పోటీలకు ఒకేసారి ఆడేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో ఒక జట్టుకు ఎప్పటిలాగే సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్?గా ఉంటాడు. ఇంకో జట్టుకు శ్రేయస్ అయ్యర్?కు నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. 'ఆసియా క్రీడలు, వెస్టిండీస్?తో సిరీస్ ఒకే టైమ్?లో ఉండనున్నాయి. అందువల్ల రెండు జట్లను బరిలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందుకోసం 30- 35 ఆటగాళ్లతో కూడిన లిస్ట్? రెడీ అవుతోంది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లకు కూడా ఈ లిస్ట్?లో నుంచే ఎంపిక చేస్తాం. ఇక ప్రస్తుతం ఐపీఎల్?లో ఆడుతున్న కుర్రాళ్లకు ఇది గోల్డెన్ ఛాన్స్. మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఆటగాళ్లను ఎంపిక చేస్తాం. అయితే రెండు జట్లు కూడా పటిష్ఠంగానే ఉండాలని బోర్డు భావిస్తోంది' అని బోర్డు మెంబర్ ఒకరు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్- అక్టోబర్? విండోలో భారత్?కు వెస్టిండీస్?తో టీ20 సిరీస్? ఉంది. స్వదేశంలో విండీస్?తో టీమ్ఇండియా 5 మ్యాచ్?ల సిరీస్? ఆడనుంది. అదే సమయంలో మరోవైపు జపాన్ వేదికగా ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో క్రికెట్ క్రీడ కూడా ఉంటుంది. అందుకే ఇలాంటి సందర్భాల్లో రెండు జట్లు ఉంటే బాగుంటుందని బోర్డు భావిస్తోంది. ఒక జట్టు విండీస్?తో సిరీస్?కు, ఇంకో టీమ్ ఆసియా గేమ్స్?లో పాల్గొంటుంది. ఇలా రెండు జట్లను గతంలో బీసీసీఐ ప్రయత్నించి సక్సెస్ అయ్యింది. 2022 ఆసియా క్రీడల్లో భాగంగా క్రికెట్?ను చేర్చారు. ఆ పోటీల్లో 2023 అక్టోబర్?లో మ్యాచ్?లు నిర్వహించారు. అదే సమయంలో సీనియర్ ఆటగాళ్ల జట్టు వన్డే వరల్డ్?కప్ కోసం సన్నద్ధం అవుతోంది. అందుకే రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలోని యువ జట్టును బీసీసీఐ చైనాకు పంపింది. ఆ క్రీడల్లో సత్తా చాటిన యువ భారత్ గోల్డ్ మెడల్ సాధించింది.


..........

# పంజాబ్ నయా రికార్డు..



ఐపీఎల్ 2026లో అన్ బీటెన్ గా ఉన్న ఏకైక టీమ్ పంజాబ్ కింగ్స్ జోరు కొనసాగుతోంది. వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ సాధించి, పాయింట్ల పట్టికలో తన ప్లేస్ ను మరింత పటిష్టం చేసుకుంది. అలాగే ఈ టోర్నీలో ఐదో విజయాన్ని సాధించి, ప్లే ఆఫ్స్ వైపు వడివడిగా అడుగులు వేస్తోంది. ఇక ఆదివారం సొంతగడ్డ చండీగఢ్ మైదానంలో జరిగిన మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ పై 51 పరుగులతో ఘనవిజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 254 పరుగులు చేసింది. ఈ సీజన్లో ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. పంజాబ్ బ్యాటర్లు 21 సిక్సర్లతో సత్తా చాటారు. ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య తూఫాన్ ఇన్నింగ్స్ (37 బంతుల్లో 93, 4 ఫోర్లు, 9 సిక్సర్లు) తో సిక్సర్ల సునామీ సృష్టించాడు. బౌలర్లలో సిద్ధార్థ్, మహ్మద్ షమీకి రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో ఓవర్లన్నీ ఆడిన లక్నో.. 5 వికెట్లకు 200 పరుగులకు పరిమితమైంది. రిషభ్ పంత్ కెప్టెన్ ఇన్నింగ్స్ (23 బంతుల్లో 43, 1 ఫోర్, 4 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. మార్కో యాన్సెన్ కు రెండు వికెట్లు దక్కాయి. ఓవరాల్ గా ఈ విజయంతో పంజాబ్ 11 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత పటిష్ట పరుచుకుంది. సోమవారం అహ్మదాబాద్ లో జరిగే మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ తో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన లక్నో.. ఓపెనర్లలో ఒక మార్పు చేసింది. విధ్వంసక మిషెల్ మార్ష్ (40)కు తోడుగా యువ బ్యాటర్ ఆయుష్ బదోనీ (35)ని పంపింది. అయితే ఈ మూవ్ ఓ మాదిరిగా పని చేసిందనే చెప్పాలి. ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఆడిన ఈ జంట ఆ తర్వాత జోరు కనబర్చారు. ఓవర్ కు పది పరుగుల రన్ రేట్ తో పరుగులు సాధించిన లక్నో.. పవర్ ప్లేలో 61 పరుగులు సాధించి, ఆఖరు బంతికి ఆయష్ వికెట్ ను కోల్పోయింది. వన్ డౌన్ లో వచ్చిన రిషభ్ పంత్ ఉన్నంత సేపు వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. పంత్ తో కలిసి 48 పరుగులు జోడించిన తర్వాత మార్ష్ ఔటవడంతో 109 పరుగుల వద్ద లక్నో రెండో వికెట్ ను కోల్పోయింది.

# శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్!




పంజాబ్ కింగ్స్ ) కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) భారీ ప్రమోషన్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ అటు కెప్టెన్‌గా.. ఇటు ఆటగాడిగా అద్భుత ప్రదర్శన కనబరుస్తుండటంతో టీమిండియా టీ20 సారథ్య బాధ్యతలు అప్పగించాలని బీసీసీఐ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన వెంటనే టీమిండియా టీ20 సిరీస్ కోసం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ పర్యటనకు శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు మీడియాకు తెలిపాయి. మూడు వేర్వేరు ఐపీఎల్ ఫ్రాంచైజీలను ఫైనల్స్‌కు చేర్చిన ఏకైక కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ రికార్డ్ సాధించిన సంగతి తెలిసిందే. కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ అయ్యర్ సత్తా చాటుతున్నాడు. అతని సారథ్యంలో పంజాబ్ కింగ్స్ సరికొత్త చరిత్రను లిఖించింది. ఐపీఎల్ చరిత్రలోనే తొలి 6 మ్యాచ్‌ల్లో ఓటమెరుగని జట్టుగా పంజాబ్ నిలిచింది. ఈ ప్రదర్శన నేపథ్యంలోనే అయ్యర్‌కు టీమిండియా టీ20 కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రస్తుత టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గతేడాదిగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. దాంతో అయ్యర్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించాలని అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు డిమాండ్ చేస్తున్నారు.వచ్చే ఏడాది టీమిండియాకు బిజీ షెడ్యూల్ ఉంది. వన్డే ప్రపంచకప్ 2027తో పాటు ఆసియా గేమ్స్, భారత్-వెస్టిండీస్ టీ20 సిరీస్‌లు ఏకకాలంలో జరగనున్నాయి. దాంతో రెండు వేర్వేరు టీ20 టీమ్స్‌ను సిద్ధం చేయాలనే యోచనలో బీసీసీఐ ఉంది. ఈ క్రమంలోనే చాలా మంది ఆటగాళ్లకు భారత జట్టు తరఫున అరంగేట్రం చేసే అవకాశం లభించనుంది. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ వయస్సు పెరుగుతుండటంతో పాటు భవిష్యత్తు అవసరాల కోసం మరొక కెప్టెన్‌ను సిద్ధం చేసుకోవడానికి కూడా ఇదే మంచి అవకాశమని బీసీసీఐ భావిస్తోంది. ఆసియా గేమ్స్, భారత్ వర్సెస్ వెస్టిండీస్ టీ20 సిరీస్ ఒకే సమయంలో జరగనున్నాయి. అందుకే రెండు వేర్వేరు టీ20 జట్లు ఆడేలా మేం ప్రణాళికలు సిద్ధం చేయాలి. అంతర్జాతీయ మ్యాచ్‌ల కోసం ఇప్పటి నుంచే 30-35 మంది క్రికెటర్ల బృందాన్ని అందుబాటులో ఉంచుకోవడం ముఖ్యం. అప్‌కమింగ్ ఐర్లాండ్ టూర్‌తో పాటు యూకే పర్యటనలకు సాధారణంగా వెళ్లే దానికంటే ఎక్కువ మంది ఆటగాళ్లను ఎంపిక చేస్తాం. ఇదే విధానం ఆసియా క్రీడలకు కూడా కొనసాగుతుంది.'అని ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపాడు. టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీతో పాటు ప్రియాంశ్ ఆర్య, అనుకుల్ రాయ్, శశాంక్ సింగ్, అంగ్‌క్రిష్ రఘు వంశీలకు టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కనుంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లు ఉన్నాయి. అతను భారత్ తరఫున అరంగేట్రం చేస్తే.. ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డ్ సాధించనున్నాడు. ఆయుష్ బదోనితో పాటు రజత్ పాటిదార్‌లకు టీమిండియా పిలుపు దక్కనుంది. బౌలింగ్‌లో రవిబిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, ప్రసిధ్ కృష్ణలు రీఎంట్రీ ఇచ్చే ఛాన్స్ ఉంది. కార్తీక్ త్యాగి పేరును కూడా సెలెక్టర్లు పరిశీలించనున్నారు. వికెట్ కీపర్-బ్యాటర్‌గా ధ్రువ్ జురెల్ రేసులో అందరికంటే ముందున్నాడు.

# బాబర్ అజామ్ అద్భుత ప్రదర్శన



పాకిస్థాన్ సూపర్ లీగ్ లో పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ అజామ్ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. క్వెట్టా గ్లాడియేటర్స్‌పై జరిగిన మ్యాచ్‌లో అతను శతకంతో చెలరేగి జట్టుకు కీలకంగా మారాడు. ముఖ్యంగా చివరి ఓవర్ చివరి బంతికి వేగంగా పరుగెత్తి, చాకచక్యంగా డైవ్ చేసి తన సెంచరీని పూర్తి చేయడం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. టీ20లకు అతను సరిపోడని విమర్శించిన వారికి, 192.31 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో బాబర్ గట్టి సమాధానం ఇచ్చి పాకిస్తాన్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేశాడు. కరాచీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో బాబర్ అజామ్ ఓపెనర్‌గా వచ్చి మొదటి నుంచే దూకుడుగా ఆడాడు. సాధారణంగా నిదానంగా ఆడే తన శైలిని పక్కనపెట్టి, బంతిని మైదానం నలుమూలలా చెదరగొట్టాడు. కేవలం 52 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు సాధించిన అతని ఇన్నింగ్స్‌లో 6 బౌండరీలు, 4 భారీ సిక్సర్లు ఉన్నాయి.గత మూడేళ్లుగా పెద్ద జట్లపై విఫలమవుతాడన్న విమర్శలను ఎదుర్కొన్న బాబర్, 2026్రూలో తన ఫామ్‌ను తిరిగి చాటుకున్నాడు. పెషావర్ ఇన్నింగ్స్‌లో చివరి ఓవర్‌ను క్వెట్టా బౌలర్ జహాందాద్ ఖాన్ వేశాడు. చివరి బంతికి సెంచరీ పూర్తి చేయడానికి బాబర్ అజామ్‌కు 2 పరుగులు అవసరమయ్యాయి. బంతిని కొట్టిన వెంటనే అతను వేగంగా పరుగెత్తి, రనౌట్ ప్రమాదం నుంచి తప్పించుకోవడానికి డైవ్ చేస్తూ తన శతకాన్ని పూర్తి చేశాడు.బాబర్‌కు అండగా నిలిచిన కుశల్ మెండీస్ 44 బంతుల్లో 83 పరుగులు చేసి మంచి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి రెండో వికెట్‌కు 75 బంతుల్లో 135 పరుగులు జోడించారు. ఈ శతకంతో బాబర్ అజామ్ కెరీర్‌లో పలు చారిత్రక రికార్డులను సృష్టించాడు. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 12,000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా అతను నిలిచాడు. కేవలం 338 ఇన్నింగ్స్‌లలోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకుని రికార్డు నెలకొల్పాడు.వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ (344 ఇన్నింగ్స్‌లు), భారత స్టార్ విరాట్ కోహ్లీ (360 ఇన్నింగ్స్‌లు) సాధించిన రికార్డులను అతను అధిగమించాడు. వారిద్దరి కంటే వేగంగా ఈ ఘనత సాధించాడు.ప్రస్తుత 2026 ్రూ టోర్నమెంట్‌లో బాబర్ అజామ్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. అతను ఇప్పటివరకు 7 ఇన్నింగ్స్‌లలో 401 పరుగులు చేశాడు. ఈ సెంచరీ తర్వాత అతని బ్యాటింగ్ సగటు ఏకంగా 100.25కి చేరింది. టీ20 మ్యాచ్‌లలో దూకుడుగా పరుగులు సాధించగల తన సామర్థ్యాన్ని బాబర్ అజామ్ సుదీర్ఘ కాలం తర్వాత మరోసారి నిరూపించుకుని విమర్శకుల నోళ్లను మూయించాడు.

# విజయం సాధించాలనే ఉద్దేశంతోనే టీమ్ కాంబినేషన్‌ను మార్చాం

## ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా



ఎలాగైనా విజయం సాధించాలనే ఉద్దేశంతోనే టీమ్ కాంబినేషన్‌ను మార్చామని ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. డానిష్ మలేవార్, క్రిష్ భగత్ అరంగేట్రం చేస్తున్నారని తెలిపాడు. ఈ ఇద్దరి కోసం ర్యాన్ రికెల్టన్, ట్రెంట్ బౌల్ట్‌లపై వేటు వేసామని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. తుది జట్టులో రెండు మార్పులు చేశామని టాస్ సందర్భంగా వెల్లడించిన హార్దిక్ పాండ్యా.. తమ జట్టు పుంజుకోవడానికి ఈ మ్యాచ్ చివరి అవకాశామని చెప్పాడు. 'టాస్ గెలిస్తే మేం కూడా బౌలింగ్ ఎంచుకోవాలని అనుకున్నాం. ఒక జట్టుగా పుంజుకోవడానికి ఇది మాకు చివరి మ్యాచ్. ముంబై ఇండియన్స్ సత్తా చూపించాలని, అందుకోసం ఎలా ఆడాలనే విషయాల గురించి మేం చర్చించుకున్నాం. అందరూ ఈ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఉన్నారు. గతంలో ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి మేం పుంజుకున్నాం. ఈ సారి కూడా గెలుపు బాట పట్టాలనే పట్టుదలతో ఉన్నాం. ఒకరికొకరు అండగా ఉంటూ ముందుకు సాగాలనుకుంటున్నాం. కష్టకాలం ఉండవచ్చు, కానీ ఒకరికొకరు తోడుగా ఉంటూ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మేం జట్టుగా మెరుగపడాలి. మా ఓటములకు ఒకే ఒక కారణాన్ని నేను చెప్పలేను. మేం కలిసి గెలుస్తాం. కలిసి ఓడిపోతాం. కాబట్టి ఒక సమూహంగా మేం మెరుగుపడాలి. ఇదొక కొత్త రోజు.. సూర్యుడు మళ్లీ ఉదయించాడు. మేము సానుకూల దృక్పథంతో ఉన్నాం. మా జట్టులో ఈరోజు ఇద్దరు ఆటగాళ్లు అరంగేట్రం చేస్తున్నారు. డానిష్ మలేవార్‌తో పాటు క్రిష్ భగత్ బరిలోకి దిగుతున్నారు. క్రిష్ భగత్ మాకు నెట్ బౌలర్‌గా సేవలందించాడు. అతని ప్రదర్శన మమ్మల్ని ఆకట్టుకుంది. మూడు రోజుల క్రితమే అతను ప్రధాన జట్టులోకి వచ్చాడు. జీవితం అంటే ఇదే. ఈ రోజు అతను తుది జట్టులో ఆడుతున్నాడు.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిచిన శుభ్‌మన్ గిల్.. బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతామని చెప్పాడు.

# రహానే ఖాతాలో చెత్త రికార్డు..




అజింక్య రహానే సారథ్యంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ ఐపీఎల్ 2026లో ఎట్టకేలకు తమ మొదటి విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేకేఆర్ కెప్టెన్ రహానే, టిమ్ సీఫెర్ట్ రూపంలో ఇద్దరు ఓపెనర్లు ఖాతా కూడా తెరవలేకపోయారు. 85 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కోల్‌కతా కష్టాల్లో పడింది. అయితే రింకూ సింగ్ హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్ కోల్‌కతాను ఓడిపోయే మ్యాచ్‌లో గెలిపించి తొలి విజయాన్ని అందించింది. కానీ ఈ మ్యాచ్‌లో రహానే పేరిట ఒక దారుణమైన రికార్డు నమోదైంది. ఓవైపు జట్టు వరుస ఓటములు, మరోవైపు బ్యాటర్‌గా సైతం రహానే విఫలం కావడం విమర్శలకు దారితీస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్యా రహానే ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు డకౌట్ అయిన ఓపెనర్‌గా నిలిచాడు. రహానే ఇప్పటి వరకు మొత్తం 12 సార్లు డక్ అవుట్ అయ్యారు. దీనికి ముందు మ్యాచ్‌లో ఆయన 11 సార్లు ఓపెనర్‌గా సున్నాకే అవుట్ అయి, పార్థివ్ పటేల్ రికార్డును సమం చేశారు. రాజస్తాన్‌తో మ్యాచ్‌లో డకౌట్‌తో అత్యధిక డకౌట్లు అయిన ఓపెనర్‌గా చెత్త రికార్డును రహానే మూటకట్టుకున్నాడు. అజింక్యా రహానే ఈ ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో 67 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడినా ఆ మ్యాచ్‌లో కోల్‌కతా ఓడిపోయింది. ఆ తర్వాత ఆడిన 6 ఇన్నింగ్స్‌లలో 4 సార్లు రహానే రెండంకెల స్కోరును కూడా అందుకోలేకపోయాడు. రాజస్థాన్ కంటే ముందు గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రహానే ఖాతా తెవరకుండానే సున్నాకే అవుట్ అయ్యాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 7 మ్యాచ్‌ల్లో రహానే 152 పరుగులు చేశారు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ కేవలం 155 పరుగులు మాత్రమే చేసింది. . వరుణ్ చక్రవర్తి 4 ఓవర్లలో కేవలం 14 పరుగులిచ్చి 3 వికెట్లు తీయగా, కార్తీక్ త్యాగి 4 ఓవర్లలో 22 పరుగులిచ్చి 3 వికెట్లతో రాణించాడు. సునీల్ నరైన్ 2 వికెట్లు పడగొట్టాడు. టార్గెట్ ఛేదించే క్రమంలో కేకేఆర్ ఆరంభం చాలా దారుణంగా సాగింది. మొదటి ఓవర్‌లో టిమ్ సీఫెర్ట్ (0), రెండో ఓవర్‌లో అజింక్యా రహానే (0) డకౌట్ అయ్యారు. ఆ తర్వాత ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అంగ్‌క్రిష్ రఘువంశీ (10) కూడా తక్కువ స్కోరుకే వికెట్ సమర్పించుకున్నాడు. కామెరూన్ గ్రీన్ (27), రోవ్‌మన్ పావెల్ (23) ఆదుకునే ప్రయత్నం చేశారు. రమణ్‌దీప్ సింగ్ (10) కూడా త్వరగానే అవుటయ్యాడు. 13.3 ఓవర్లలో జట్టు 6వ వికెట్ కోల్పోయినప్పుడు స్కోరు 85 పరుగులు మాత్రమే. దాంతో కోల్‌కతా జట్టుకు రమో ఓటమి తప్పదని అంతా అనుకున్నారు. అప్పుడు రింకూ సింగ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్ది ఓడిపోయే స్థితిలో ఉన్న మ్యాచ్‌ను గెలిపించి కేకేఆర్ కు తొలి విజయాన్ని అందించాడు. రింకూ 34 బంతుల్లో 2 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 53 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనుకూల్ రాయ్ అతడికి సహకరిస్తూ 16 బంతుల్లో 29 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దాంతో ఉత్కంఠపోరులో కేకేఆర్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999